
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



ఆంజనేయా.. అభయమివ్వుస్వామి..
గండి వీరాంజనేయస్వామి పుణ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. -8లో



ఆన్‌లైన్ దొంగలున్నారు
సైబర్ నేరగాళ్లు సులువుగా డబ్బు సంపాదించేందుకు ఎప్పటికప్పుడు తమ పంథా మార్చుకుంటున్నారు. సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చాక ప్రజలను సులభంగా మోసగిస్తున్నారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
26.8/22.6

వాతావరణం
జిల్లాలో శనివారం 22.6 - 26.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

పోటెత్తిన ప్రజానీకం



మాచునూరు చంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో మాజీ సీఎం వైఎస్ జగన్



బాగున్నావా జేజీ అంటూ అబ్బిరెడ్డి తల్లి సుబ్బలక్షుమ్మను పలుకరిస్తూ...



మనసున్న మారాజువు అంటూ... వైఎస్ జగన్‌కు వృద్ధుల పలుకరింపు



అభిమానులతో సెల్ఫీ దిగుతూ...



వైఎస్ జగన్‌కు గొర్రెపిల్లను బహూకరిస్తున్న ఈశ్వరయ్య



యువకుడి ఉత్సాహం..





పెండ్లిమర్రి మండలం గొందిపల్లెలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- వర్షాన్ని లెక్కచేయకుండా దారిపొడవునా వేచి ఉన్న జనం
- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు ఆతృత చూపించిన వృద్ధులు
- సెల్ఫీల కోసం ఎగబడిన గ్రామీణ యువత

సాక్షి ప్రతినిధి, కడప: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో శనివారం ప్రజానీకం పోటెత్తారు. ఉదయం నుంచి వర్షపు జల్లులు క్రమం తప్పకుండా పడుతున్నా లెక్కచేయకుండా అభిమాన నేతను చూసేందుకు ప్రజలు గంటల తరబడి రోడ్డుపై వేచి ఉన్నారు. గ్రామ గ్రామాన ప్రజలను పలకరిస్తూ, పార్టీ శ్రేణుల యోగక్షేమాలు తెలుసుకుంటూ ముందుకు కదిలారు. మరోవైపు గ్రామీణ యువత సెల్ఫీలు తీసుకునేందుకు పెద్ద ఎత్తున ఎగబడ్డారు. దీంతో కడప ఎయిర్‌పోర్టు నుంచి పులివెందుల చేరుకునేందుకు 9గంటల సమయం పట్టింది. ఎయిర్‌పోర్టు నుంచి బయటికి రాగానే అక్కడే వేచి ఉన్న పార్టీ శ్రేణులు, అభిమానులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూడగానే కేరింతలు కొట్టారు. యువత సీఎం.. సీఎం అంటూ నినాదాలు చేశారు. అక్కడి నుంచి తోళ్లగంగనపల్లెకు చేరుకున్నారు. రోడ్డుపై వేచి ఉన్న గ్రామస్తులను పలకరించి వల్లూరు చేరగా పెద్ద ఎత్తున శ్రేణులు స్వాగతం పలికాయి. భారీగా బాణా సంచా పేలుస్తూ యువత కేరింతలు కొట్టారు. తర్వాత తప్పెట్ల, వేంకటేశాపురం వద్ద వేచి ఉన్న ప్రజానీకాన్ని పలకరించి, దుగ్గాయపల్లె వీవర్స్ కాలనీ చేరుకున్నారు. నడవలేని ముదుసలి సైతం ఊతకర్ర సాయంతో వడివడిగా రోడ్డుపైకి చేరుకొని మాజీ సీఎం వైఎస్ జగన్ కోసం ఎదురుచూడడం ఆరంభించారు.

గొర్రెపిల్ల బహూకరణ: మాచునూరు నుంచి బయలుదేరిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చౌటపల్లె, ఆర్వేటిపల్లె, బుద్దాయపల్లె, తుమ్మలూరు క్రాస్ వద్ద వేచి ఉన్న ప్రజలను పలకరించారు. నాగాయపల్లె క్రాస్ సమీపంలోకి చేరుకోగానే ఆ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య మాజీ సీఎం వైఎస్ జగన్‌కు గొర్రెపిల్లను బహూకరించారు. తర్వాత పగడాలపల్లె, ద్వారకానగర్, చెర్లోపల్లె క్రాస్ వద్ద ఉన్నవారిని పలకరిస్తూ ముందుకు కదిలారు. గుర్రాలచింతలపల్లె, బాలయ్యగారిపల్లె మీదుగా గొందిపల్లె చేరుకున్నారు. అప్పటికే గంటల తరబడి రోడ్డుపై ఉన్న మహిళలు ఆతృతగా ఎదురుచూడడం ఆరంభించారు.

నూతన జంటకు ఆశీర్వాదం: ఇటీవల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రహాసరెడ్డి కుమార్తె వివాహమైంది. వారి స్వగ్రామం గొందిపల్లెలో నూతన జంట ఆశా, శివారెడ్డిలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు. అక్కడున్న మాచవరం కుటుంబ సభ్యులతోపాటు, బంధు మిత్రులను పేరుపేరునా పలకరించారు. తర్వాత ఇందిరానగర్, శాంతినగర్, తిప్పరాజుపల్లె, నందిమండలం, కొత్తూరు, తంగేడుపల్లె, వేంపల్లె క్రాస్ రోడ్డు ఇలా అడుగడుగునా ఘనస్వాగతం లభించింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, కమలాపురం సమన్వయకర్త నరేన్ రామాంజులరెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు



మాచునూరులో అభిమానంతో గుమికూడిన ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

బాగున్నావా...జేజీ..

దుగ్గాయపల్లె గ్రామానికి చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి వచ్చి వెళ్లాల్సిందిగా ఆర్టీసీ మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి సోదరుడు శంకరరెడ్డి కోరారు. అదే రోడ్డు వెంబడి వెళ్తున్న ఆయన ఇంటికి వెళ్లి వారి తల్లి సుబ్బలక్షుమ్మను బాగున్నావా...జేజీ.. అని పలకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దపుత్తలో గ్రామమంతా రోడ్డుపైకి వచ్చి వైఎస్ జగన్‌కు జేజేలు పలికారు. పెద్దపుత్త గ్రామం దాటగానే కమలాపురానికి చెందిన నేతలు ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులంతా వేచి ఉండగా కాన్వాయ్‌ని ఆపి వారందరినీ పేరుపేరునా పలకరించారు. పైడికాల్వ క్రాస్‌లో దిగువపల్లె, ఎగువపల్లెకు చెందిన వారు వేచి ఉండడంతో వారిని పలకరించి పైడికాల్వ గ్రామం చేరుకున్నారు. గడ్డం సుబ్బారెడ్డి నేతృత్వంలో స్వాగతం పలికారు. అక్కడి నుంచి మాచునూరు దళితవాడ గుండా మాచునూరు చేరుకున్నారు. ఆ గ్రామ యువకులు కాన్వాయ్‌పై పూలవర్షం కురిపించారు. దివంగత మాచునూరు చంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్యపడొద్దని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

న్యూస్‌రీల్

3న జమ్మలమడుగులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబరు 3వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జమ్మలమడుగు పట్టణంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ జాబ్‌మేళాలో అభి టెక్నాలజీస్‌లో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, గ్రూప్ లీడర్స్, అల్ డిక్సన్ (కిరణ్ సర్వీసెస్)కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్స్, బీజెడ్ ఫిన్ సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కస్టమర్ రిలేషన్‌షిప్ అసోసియేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిగ్రీ, పీజీ చదివి 18–32 సంవత్సరాల వయస్సుగల వారు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు తమ విద్యార్హతల ధృవపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు.

పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతం



పత్రాలను సమర్పిస్తున్న ఆర్డీ వై.శ్రీనివాసులు

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో శనివారం కడపలో రాయలసీమప్రాంత ఉద్యోగులకు నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా సాగింది. 17 మంది హెల్త్ అసిస్టెంట్ (ఎఫ్)లకు హెల్త్ సూపర్‌వైజర్లుగా, ఎంపీహెచ్ఎస్ (ఎఫ్) నుంచి పీహెచ్ఎన్ నాన్ టీచింగ్‌కు సంబంధించి ముగ్గురికి పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ వెంకట సుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ వనీషా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు యూరియా రాక

కడప అగ్రికల్చర్: రాష్ట్రీయ కెమికల్ ఫర్టిలైజర్స్‌కు చెందిన 900 మెట్రిక్ టన్నుల యూరియా శనివారం జిల్లాకు వచ్చిందని వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో 400 మెట్రిక్ టన్నులు జిల్లాలోని ప్రైవేటు డీలర్లు కేటాయించగా మరో 500 మెట్రిక్ టన్నులను రైతు సేవా కేంద్రాలకు కేటాయించినట్లు ఆయన చెప్పారు.



యూరియా బస్తాలను దించుతున్న కూలీలు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పిలుపునిచ్చారు. శనివారం ఉదయం స్థానిక నాగరాజుపేట 23వ వార్డులోని లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సక్రమంగా వైద్యాన్ని అందిస్తున్నారా అని ఆరా తీశారు. బండి జయలక్ష్మి, షేక్ జిలానీ, సయ్యద్ ఖుర్షీద్ తదితర లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 4 వేల రూపాయల చొప్పున ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ నందన్, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రాకేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ శివశంకర్

ఆశల చినుకులు

మండలం	వర్షపాతం (మి.మీ)	మండలం	వర్షపాతం (మి.మీ)
మైదుకూరు	97	కలసపాడు	30.4
పొద్దుటూరు	93	తొండూరు	28.6
ఖాజీపేట	81.4	కాశినాయన	28.2
చాపాడు	75.2	కొండాపురం	22.2
జమ్మలమడుగు	65.2	పోరుమామిళ్ల	21.2
చెన్నూరు	63.4	సింహాద్రిపురం	16.6
కమలాపురం	62.4	పులివెందుల	16.2
వల్లూరు	52.4	వేంపల్లె	13.2
ఎర్రగుంట్ల	52.6	చక్రాయపేట	12.2
పెండ్లిమర్రి	45.2	వేముల	12
దువ్వూరు	43.4	బి.కోడూరు	10.8
కడప	38.2	లింగాల	10.6
రాజుపాలెం	36.8	పెద్దముడియం	10.2
మైలవరం	35.4	బద్వేల్	3.6
వీఎన్‌పల్లి	35	సీకేదిన్నె	3.4
సిద్ధవటం	31.4	గోపవరం	3.2



మైదుకూరు ప్రాంతంలో సాగుకు సిద్ధంగా ఉన్న వరినారు



వర్షం రాకతో సిద్ధవటం ప్రాంతంలో కళకళలాడుతున్న వరి పంట

- జిల్లా అంతటా వర్షం... ఆరుతడి పంటలకు ప్రాణం
- మైదుకూరులో అత్యధికంగా 97 మిల్లీమీటర్ల వర్షం

కడప అగ్రికల్చర్: గత కొద్దిరోజులుగా ఎండలు వేసవిని తలపించాయి. దీంతో ప్రజలతోపాటు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల సాగు చేసిన పంటలు సైతం ఎండుముఖం పట్టాయి. రైతన్నను వరుణుడు కరుణించాడు.పంటలకు ఊపిరిపోసేలా ఆశల చినుకులను కురిపించాడు. దీంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఆరుతడి పంటలకు ఊపిరి...
జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల ఆరుతడి పంటలకు ఎంతో మేలు జరగనుంది. ఖరీఫ్ ప్రారంభంలోనే అశాజనకంగా వర్షాలు కువడంతో కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లి, ఎర్రగుంట్ల మండలాల పరిధిలో 5 వేల ఎకరాల్లో రైతులు మినుముపంట సాగు చేశారు.తర్వాత సరైన వర్షం లేక మినుముపంట ఎండిపోవడంతో దున్నేశారు. మిగతా ఆరుతడి పంటలైన పత్తి, కంది, వేరుశనగ, సజ్జ, కొర్ర, సన్‌ఫ్లవర్ సోయాబీన్ పంటలు కూడా అక్కడక్కడ ఎండుముఖం పట్టాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ తరుణంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వేరుశనగ పంట బాగా ఊడలు దిగి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని, పత్తిపంటకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. జిల్లాలో బోర్లు, నదీపరివాహక ప్రాంతాల్లో ఇప్పటి దాకా 24715 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం కురిసిన వర్షం వరిపంటకు టానిక్‌లా పనిచేయనుందని పలువురు రైతులు తెలిపారు.


జిల్లాలో పంటల సాగు వివరాలు హెక్టార్లలో..

పంట	సాధారణ సాగు	ప్రస్తుతం సాగైనది
వరి	31171	9886
మొక్కజొన్న	637	1329
కొర్ర	976	905
కంది	3894	3094
మినుము	2642	6722
వేరుశనగ	5971	2750
సన్‌ఫ్లవర్	1126	168
సోయాబీన్	963	358
పత్తి	24086	7954

కేసీ కెనాల్ కింద ముమ్మరం కానున్న వరిసాగు...
ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరదనీరు శ్రీశైలం డ్యాంకు చేరడటంతో డ్యామ్ నిడింది. దీంతో కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు కేసీ కెనాల్ కింద నారుమడులు సాగు చేశారు. చాలాచోట్ల నారు సాగుకు సిద్ధం అయింది. ఈ తరుణంలోనే వర్షం కురవడంతో సాగు ముమ్మరం కానుంది.

సాగుకు సమాయత్తం...
జిల్లా జూన్ తరువాత సరైన వర్షం లేకపోవడంతో చాలామంది రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోలేక పొలాలను బీళ్లుగా వదిలేశారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో బీడు భూముల్లో ఆరుతడి పంటలు సాగుకానున్నాయి. ముఖ్యంగా మినుము, పెసర, కంది, ఆముదం, ఆలసంద, ఆనప, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయనున్నారు.

ఆరుతడి పంటలకు మేలు



జిల్లాలో 45 నుంచి 60 రోజుల వరకు వర్షాల లేని కారణంగా వాడు ముఖం పట్టిన మినుము, వేరుశనగ, పత్తి, కంది పంటలకు ఉపశమనం కలుగుతుంది. పత్తి పంటకు కూడా మేలు జరగనుంది. ఆరుతడి పంటల్లో కలుపులు తీసుకుని ఎరువులను వేసుకుంటే మంచి దిగుబడిని సాధించడానికి వీలవుతుంది. అలాగే ప్రస్తుతం కురిసిన వర్షానికి మినుము, కంది, పెసర, ఆలసంద, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను కూడా విత్తుకోవచ్చు.
– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరేట్‌లో 08562-246344 నంబర్‌తో కంట్రోల్ రూము ఏర్పాటు
- కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. అలాగే ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్ కార్యాలయంలో 08562 246344 నంబరుతో ప్రత్యేకంగా 24 గంటలపాటు పనిచేసే కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. నదులు, వంకలు పరీవాహక ప్రాంతాలు, అన్ని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల వల్ల చెరువులు, కాలువలకు గండ్లు పడే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన ఇసుక సంచులను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. అలాగే వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదానికి గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోరాదని చెప్పారు. ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలని, వర్షం పడే సమయంలో టీవీ,ఫ్రిజ్, కంప్యూటర్లను స్విచ్ ఆఫ్ చేయాలన్నారు.

అండర్-14 క్రికెట్ ఎంపికలు వాయిదా

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించాల్సిన అండర్–14 క్రికెట్ ఎంపికలు వర్షం కారణంగా వాయిదా వేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎంపికలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని చెప్పారు. కావున క్రీడాకారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

సచివాలయంలో పాము హల్‌చల్



బురుజుపల్లె సచివాలయం వద్ద జనం చంపేసిన కట్లపాము

కొండాపురం : ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించాలని బస చేస్తున్న సిబ్బందికి ఓ పాము కనిపించి భయపెట్టిన వైనం మండలంలోని బురుజుపల్లె సచివాలయంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద 31న పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించింది. దీంతో బురుజుపల్లె సచివాలయ సిబ్బంది శుక్రవారం రాత్రి సచివాలయంలోనే బస చేశారు. రాత్రి కట్లపాము కనిపించి హల్‌చల్‌చేసింది. సిబ్బంది భయపడి పరుగు తీశారు. గ్రామస్థులు వచ్చి పామును చంపేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. తెల్లవారుజామునే ఇవ్వాలని చెప్పడంతో సిబ్బంది ముందు రోజు రాత్రి సచివాలయంలోనే ఉండాల్సి వచ్చిందని, పాముతో ఎవరికీ ప్రమాదం కలగలేదని సిబ్బంది తెలిపారు.

ఆన్‌లైన్ దొంగలున్నారు..



నేను ఎస్పీని మాట్లాడుతున్నాను.. మీ అబ్బాయి డ్రగ్స్‌తో పట్టుబడ్డాడు.. సెక్స్ రాకెట్ ముఠాలో మీ కుమారుడు దొరికాడు.. అంటూ ఇటీవల రాజంపేటలో ఓ ముగ్గురికి ఫోన్లు వచ్చాయి. ప్రొఫైల్ ఫొటోలో పోలీస్ ఆఫీసర్ డ్రెస్ ఉండడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లలకు ఫోన్ చేయగా క్షేమంగా ఉన్నట్లు తెలుపడంతో ఫేక్ కాల్ అని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు.

రాజంపేట పట్టణం విద్యుత్ నగర్‌కు చెందిన సుధీర్ అనేక వ్యక్తి ఉన్న చదువులు చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అయితే రెండు సంవత్సరాల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌కు వచ్చిన మెసేజ్‌కు అతను స్పందించాడు.. తన న్యూడ్‌గా ఫొటో పంపాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ సుధీర్ కనిపించ లేదు. అతడి ఆచూకీ తెలియక తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఇలాంటి సంఘటనలు రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇటీవల పెరిగి పోతున్నాయి. సైబర్ నేరగాళ్లు సులువుగా డబ్బు సంపాదించేందుకు ఎప్పటికప్పుడు తమ పంథా మార్చుకుంటున్నారు. సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చాక ప్రజలను మోసగించి డబ్బు సంపాదించడం వారికి అలవాటుగా మారిపోయింది. పోలీసులు హెచ్చరిస్తున్నా.. కొందరు ఇలాంటి వారిని నమ్మి మోసపోతూనే ఉన్నారు.

- రూటు మార్చిన సైబర్ నేరగాళ్లు
- తల్లిదండ్రులను బెదిరిస్తూ ఫోన్ కాల్స్

రాజంపేట టౌన్ : రాజంపేట నియోజకవర్గంలో తొలుత బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని ప్రజలకు ఫోన్ చేస్తున్నారు. వారి బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు నెంబర్ తెలుసుకొని వారి ద్వారా ఓటీపీ నెంబర్ చెప్పించుకుంటున్నారు. అనంతరం వారి ఖాతా నుంచి డబ్బును సైబర్ నేరగాళ్ళు డ్రా చేస్తున్నారు. ఈ విధంగా మోసపోయి డబ్బులు పోగొట్టుకున్న తర్వాత అప్రమత్తమయ్యే వారి సంఖ్య పెరిగింది. ఈ మూడు నెలల్లోనూ దాదాపు 20 మందికి ఇలా ఫోన్లు వచ్చినట్లు తెలిసింది. ఇటీవల పోలీసుల సలహాలతో కొందరు వెనక్కు తగ్గడంతో సైబర్ నేరగాళ్ళు పంథా మార్చారు. ఫేస్‌బుక్ అకౌంట్లను హ్యాక్ చేసి ఖాతా దారుడి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లో ఉన్న వారికి ఫోన్ చేస్తున్నారు. తాను హాస్పిటల్‌లో ఉన్నానని.. అర్జెంట్‌గా డబ్బులు కావాలని మెసేజ్ పెట్టి ఫలానా బ్యాంకు ఖాతాకు నగదు జమచేయమని అడుగుతున్నారు. చాలా మంది మోసపోయి డబ్బు పోగొట్టుకుంటున్నారు.

వీడియో కాల్స్ చేసి.. బ్లాక్‌మెయిల్ చేశారు

కొందరు విద్యార్థులు, ఇతర ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులకు ఫోన్ చేసి.. ఏదో రకంగా మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు మహిళలను అడ్డు పెట్టుకొని డబ్బు సంపాదిస్తున్నారు. యువతను, సమాజంలో ఓ స్థాయిలో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకొని వీడియో కాల్స్ చేస్తున్నారు. కాల్ లిఫ్ట్ చేయగానే మహిళ నగ్నంగా దర్శనమిస్తుంది. వీడియోలో ఉండే మహిళ ఆసక్తిగా చూస్తూ మాటలు కలుపుతుంది. ఎవరైనా ఆకర్షితులైతే పురుషుడిని కూడా నగ్నంగా ఉండాలని కోరుతుంది. కొందరు తొందరపడి ఆ మహిళ చెప్పినట్లు చేస్తే అదంతా వీడియో తీసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఈవిషయం బయటపడితే పరువుపోతుందని చాలా మంది బ్లాక్‌మెయిలర్లకు డబ్బులిచ్చి సమస్య పరిష్కరించుకుంటున్నారు.

అమ్మ భయపడి బోరున ఏడ్చేసింది



నా పేరు దేశబోయిన సురేస్ కుమార్. మాది రాజంపేట పట్టణం నారపురెడ్డిపల్లె. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. ఇటీవల మా అమ్మకు ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను పోలీస్ ఆఫీసర్‌ను.. మీ అబ్బాయి గంజాయితో పట్టుపడ్డాడు.. నేను చెప్పే నెంబర్‌కు వెంటనే లక్ష రూపాయిలు పంపండి.. లేకుంటే మీ అబ్బాయి జైల్లోనే ఉంటాడు. అంటూ భయపెట్టారు. ప్రొఫైల్ ఫొటో పోలీస్ డ్రెస్‌లో ఉండడతో అమ్మ భయపడి నాకు ఫోన్‌చేసింది. నేను ఫోన్ ఎత్తగానే ఏందిరా ఇలా చేశావంటూ ఏడుస్తూ విషయం చెప్పింది. డబ్బుకోసం అలా చేసి ఉంటారు.. నమ్మవద్దమ్మా.. నేను ఆఫీస్‌లో వర్క్ చేసుకుంటున్నాను అని చెప్పడంతో కుదుటపడింది. ఇదే విదంగా వివిధ ప్రాంతాల్లో ఉండే మా ఫ్రెండ్స్ తల్లిదండ్రులకు కూడా ఫోన్ కాల్స్ వచ్చాయి.

– దేశబోయిన సురేస్‌కుమార్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, నారపురెడ్డిపల్లె, రాజంపేట

నిజమైన పోలీసులు అలా చేయరు



సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నిజమైన పోలీసులు ప్రజలకు ఫోన్ చేసి బెదిరించి డబ్బు అడగరు. బెదిరింపు ధోరణిలో డబ్బు అడిగినా, ఓటీపీ చెప్పండి అంటూ మభ్యపెట్టే ప్రయత్నం చేసినా అది సైబర్ నేరగాళ్ల పనే. అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా ఫోన్ చేస్తే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయండి. వాళ్ళు చేసిన ఫోన్ నెంబర్ ద్వారా నిందితులను పట్టుకొని శిక్షించేందుకు వీలవుతుంది. అలాగే న్యూడ్ వీడియో కాల్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి. క్షణికావేశాలకు లోనుకావద్దు.

– కె.యల్లమరాజు, అర్బన్ సీఐ, రాజంపేట

ఏపీఎంఐపీ పీడీగా మురళీమోహన్‌రెడ్డి



కడప అగ్రికల్చర్ : ఆంధ్ర ప్రదేశ్ సూక్ష్మ సేద్య పథకం ఎఫ్ఏసీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మురళీమోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఏపీఎంఐపీ పీడిగా పని చేస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం పదవీవిరమణ చెందారు. ఆయన స్థానంలో ఏపీడీగా పనిచేస్తున్న మురళీమోహన్‌రెడ్డిని ఎఫ్ఏసీ పీడీగా నియమించారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

4న టెన్నికాయిట్ సబ్ జూనియర్ జట్ల ఎంపిక

వేంపల్లె : జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల టెన్నికాయిట్ జట్ల ఎంపికలు సెప్టెంబర్ 4న నిర్వహిస్తున్నట్లు టెన్నికాయిట్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ వెల్లడించారు. స్థానిక జడ్పీ బాలురోన్నత పాఠశాలలో నిర్వహించే ఈ ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు 2010 ఏప్రిల్, 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైన వారు సెప్టెంబరు 14 నుంచి 16వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే జట్ల ఎంపికలు ఎంఈఓ స్టాలిన్ ఐజాక్, హెచ్ఎం శివమునెమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు రాజశేఖర్, ఫ్రాన్సిస్ రవికుమార్, జయప్రద ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ 9440306203 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

తల్లి, కుమారుడు అదృశ్యం



నబీసాబ్‌గారి నస్రీన్, అద్దిల్

రాజుపాళెం : మండలంలోని వెలవలి గ్రామానికి చెందిన నబీసాబ్‌గారి నస్రీన్, ఆమె కుమారుడు నబీసాబ్‌గారి అద్దిల్ ఆదివారం అదృశ్యమయ్యారు. గురువారం ప్రొద్దుటూరులోని తన తల్లి ఇంటికి వెళుతున్నానని చెప్పి చిన్న కుమారుడిని తీసుకెళ్లిన నస్రీన్ అనంతరం కనిపించలేదని ఆమె అత్త మహబూబ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అదృశ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సిద్ధయ్య తెలిపారు.

ఇంట్లో చోరీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయనగర్ మూడో లైన్‌లోని ఓ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఉండగా మేడపై నుంచి వెళ్లిన దుండగుడు బీరువాలోని రెండు తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరించినట్లు బాధితులు తెలిపారు. చోరీకి పాల్పడిన నిందితుడి చిత్రాలు వీధిలోని ఓ ఇంటి వద్ద గల సీసీ కెమెరాలో నమోదైంది. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన

– ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : పాత పెన్షన్ విధానం అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉదయం పది గంటలకు కడప జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు తెలిపారు. కడప ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఎస్(కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్)ను 2004 సెప్టెంబర్, 1 నుంచి అమలుపరిచారన్నారు. గత ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకురాగా, కేంద్ర ప్రభుత్వం దాని పేరు మార్చి యూపీఎస్ పేరుతో కొత్త విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. జీతం నుంచి ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా ఉండే పాత పెన్షన్ విధానాన్ని కోరుకుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఉద్యోగుల జీతం నుంచి కాంట్రిబ్యూషన్ అయ్యే విధానాలను అమలుచేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, కార్యదర్శులు చంద్రశేఖర్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కార్మికుడికి గాయాలు



గాయపడిన జయశంకర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుండ్ల-కడప రోడ్డులోని బార్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు జయశంకర్‌రెడ్డిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక సీఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న జయశంకర్‌రెడ్డి భారతి సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న తరుణంలో రోడ్డు దాటుతుండగా, వెనుక వైపు నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. జయశంకర్‌రెడ్డికి తీవ్ర గాయాలవడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిశుద్ధ కన్యక.. మేరీమాత



దైవ సందేశం వినిపిస్తున్న రెవరెండ్ ఫాదర్ చిన్నప్ప



విశేషాలంకారంలో మరియతల్లి

కడప కల్చరల్ : తనకు జన్మనిచ్చేందుకు లోక రక్షకుడైన దేవుడు నిన్ను ఎన్నుకున్నాడని.. పవిత్రమైన మాతగా శరణు కోరిన వారికి అభయమిచ్చే ఆరోగ్య మాతగా భక్తులు ఆరాధిస్తున్నారని అన్నమయ్య జిల్లా రామాపురం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ చిన్నప్ప పేర్కొన్నారు. శనివారం మూడో రోజున ఆరోగ్య మాత ఉత్సవాలు ప్రకాశం పల్లి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ బాలసుందరం దివ్యబలి పూజ సమర్పించగా, చిన్నప్ప మరియాతల్లి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా విశ్వాసులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ మేరీమాత పరిశుద్ధ కన్య అని, లోక రక్షకుడు ఏసుక్రీస్తు ఆమె ద్వారా ఉదయించేందుకు ఆమెను పవిత్రాత్మతో నింపారన్నారు. మూడో రోజు పూజా పార్థన ప్రారంభంలో ప్రత్యేకంగా అలంకరించిన మరియతల్లి స్వరూపాన్ని భక్తిశ్రద్ధలతో చర్చి ప్రాంగణంలో విశ్వాసులు ఊరేగించారు. మరియతల్లి తేరు, దివ్య బలిపీఠం ప్రకాశంపల్లె గాయక బృందం అలంకరించింది. శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వారికి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవ ఫాదర్ ఎండీ.ప్రసాదరావు, బిషప్ సెక్రటరీ లూర్దు రాజ్, బాలశౌరి, ఫాదర్ విజయరావు, ఫాదర్ ఈరి మరియన్న, సిప్రియన్, ఆరోగ్యమాత, జేయంజె, క్రీస్తుజ్యోతి, పిల్లి మహేష్, మదర్ సెల్వి రాయపన్, ఆంథోని, సెబాస్టియన్, డేవిడ్ రాజ్, మోహన్, విజయ్ కుమార్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విద్యాకమిటీ ఎన్నిక వాయిదా



విద్యా కమిటీ ఎన్నికకు హాజరైన ఏడుగురు మహిళా సభ్యులు

- 13 మంది సభ్యులున్నా.. ఛైర్మెన్‌ను ఎన్నుకోలేని వైనం
- ఇరు వర్గాలు పట్టుబట్టడంతో పోలీసు బందోబస్తు

పోరుమామిళ్ల : వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలం సిద్ధనకిచ్చాయపల్లె ఓ చిన్న ఊరు. ఇక్కడ ప్రాథమిక పాఠశాలలో 16 మంది విద్యార్థులు ఉంటారు. వారి తరపున విద్యా కమిటీ ఛైర్మెన్ ఎన్నికకు 13 మంది తల్లులు హాజరుకాగా.. ఇరు వర్గాల తమకే పదవి కావాలంటూ భీష్మించడంతో ముచ్చటగా మూడోసారి వాయిదా పడింది. వివరాల్లోకి వెళ్తే... సిద్ధనకిచ్చాయపల్లె పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నిక గురువారం నిర్వహించారు. ఓ వర్గం నుంచి ఏడుగురు, మరో వర్గం నుంచి ఆరుగురు సభ్యులుగా ఉన్నారు. అయితే ఓ వర్గానికి చెందిన ఏడుగురు సభ్యులు మాత్రమే రాగా.. కోరం సరిపోయిందని ఎంఈవో తెలిపారు. అయితే మరో వర్గానికి చెందిన నాయకులు 13 మంది ఉంటేనే ఎన్నిక జరపాలని పట్టుబట్టడంతో మళ్లీ నిలిచిపోయింది. తాము పనులు ఆపేసి ఉదయం నుంచి స్కూల్ వద్ద కూర్చుంటే ఎన్నిక జరపకుండా ఎందుకు వాయిదా వేస్తారంటూ విద్యార్థుల తల్లులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మెజారిటీ ఉన్న గ్రూపుకే పదవి దక్కడం న్యాయమన్నారు. ఆరుగురు ఉన్న సభ్యులు తమకే పదవి ఇవ్వాలంటూ పట్టుబడుతూ మోకాలొడ్డారు. గతంలోనూ ఇలా వ్యవహరించడంతో ఉద్రిక్తత నెలకొని రెండు సార్లు ఎన్నిక వాయిదా పడింది. శనివారం మూడోసారి సీఎంఓ కేశవరెడ్డి, ఎంఈఓ బాలఅంకిరెడ్డి ఎన్నిక నిర్వహణకు వచ్చారు. మరోవైపు బద్వేల్ రూరల్ సీఐ నాగభూషణ్, పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఇరు వర్గాలకు చెందిన ఇతరులను ఊర్లోకి అనుమతించకుండా నిలిపివేశారు. సభ్యులు లోపలకు రాకపోవడంతో సమయం గడచిపోతున్నా ఎన్నిక నిర్వహణ జరగలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన బింగి నరసింహులు

కొండాపురం : మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన బింగి చిన్న నరసింహులు (65)శనివారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ ఐ హృషీకేశవరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో ఓ వివాహానికి వెళ్లి టీవీఎస్ స్కూటర్‌పై తిరిగి వస్తుండగా తాళ్లప్రొద్దుటూరు సమీపంలోని నూతన జాతీయ రహదారిపై మరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనాన్ని ఢీకొని యువకుడు దుర్మరణం



సందులమ్మ సిద్దిక్ (ఫైల్)

దువ్వూరు : మండలంలోని పెద్దజొన్నవరం మెట్ట వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన సందులమ్మ సిద్దిక్ (25), మహమ్మద్ తౌఫిక్ (20) పనుల నిమిత్తం ప్రొద్దుటూరుకు వచ్చి తిరిగి చాగలమర్రికి బైక్‌పై బయల్దేరారు. పెద్దజొన్నవరం మెట్ట వద్దకు వచ్చే సరికి వర్షంలో దారి కనిపించకపోవడంతో ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నారు. ప్రమాదంలో సిద్దిక్ అక్కడికక్కడే మృతి చెందగా, మహమ్మద్ తౌఫిక్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సిద్దిక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ఖాజీపేట : మండలంలో మట్కా నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక వక్కిలేరు సమీపంలో మట్కా రాస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి టప్పరియాజ్, షేక్ జిలానీ, జిలానీబాషాలను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి మట్కా స్లిప్స్, రూ.26,870 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సుంకేశుల గ్రామానికి చెందిన రామయ్య, ఖాజీపేట బీసీ కాలనీలో మట్కా రాస్తున్నట్లు సమాచారం రావడంతో పట్టుకుని మట్కా స్లిప్స్, రూ.2,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మట్కా, జూదం ఆడుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

ఆంజనేయా..అభయమివ్వు స్వామీ

- భక్తులతో గండి క్షేత్ర కిటకిట
- వైభవంగా స్వామి క్షేత్రోత్సవం
- ప్రశాంతంగా శ్రావణ మాసోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో గండి వీరాంజనేయస్వామి



గండి క్షేత్రంలో స్వామి ఊరేగింపునకు హాజరైన భక్తజనం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తి

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి పుణ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వర్షంలోనూ ఆంజనేయా.. ఆదరించవయ్యా అంటూ భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచే గాక, పొరుగు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, రఘుస్వామి, వేద పారాయణం చేశారు. రామ్మోహన శర్మ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో అలంకరించారు. పల్లకిలో వాహనంపై స్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుంచి క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల మధ్య ఆస్థానం నిర్వహించి ఉత్సవాలు ముగించారు. భారీగా భక్తజనం రావడంతో అద్దాలమర్రి క్రాస్, ఇడుపుల పాయ క్రాస్ వద్దనే వాహనాలు నిలిపి వేశారు. దీంతో కాలినడకన భక్తులు గండికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. మరింతమంది వేంపల్లె, చక్రాయపేట, నాగల గుట్టపల్లె, వేముల, సింహాద్రిపురం, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాల నుంచి వర్షంలోనూ కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దాతలు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మెన్ కావలి కృష్ణతేజ పాలకమండలి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు, ఆర్కే వ్యాలీ, వేంపల్లె ఎస్సైలు భాస్కర్‌రెడ్డి , రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చక్రాయపేట వైద్యాధికారి వాణి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ఆంజనేయస్వామి సన్నిధి ముంగిట వర్షంలో భక్త జనం



నృత్య ప్రదర్శన చేస్తున్న దీక్షిత, లహరి, రిషిక, తదితరులు